సాక్షి పల్నాడు

శనివారం । 2 । ఆగస్టు । 2025



స్మార్ట్ మీటర్లపై పోరాటం

కొల్లూరు : ప్రజలు విద్యుత్ స్మార్టు మీటర్లపై పోరాటం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి టి. కృష్ణమోహన్, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు వి. వెంకట్రామయ్య అన్నారు.



గోవాడలో విశేష పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

భ్రమరాంబకు పసుపు కొమ్ములతో అలంకారం



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అమ్మ వారిని పసుపు కొమ్ములతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

న్యూస్‌రీల్

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ పాలీసెట్‌- 2025 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 5న పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్‌లో సివిల్, ఈసీఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్ఈ బ్రాంచ్‌లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకై నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఇతర వివరాలకు 83329 11155, 98660 09672 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫెడరిక్ హయ్యర్‌కు నివాళులు



భట్టిప్రోలు: ఆంధ్ర ఇవాంజలికల్ 184వ లూథరన్ సంఘ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం భట్టిప్రోలులోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పితామహుడైన ఫాదర్ జాన్ క్రిస్టియన్ ఫెడరిక్ హయ్యర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ఆరాధనలు చేశారు. లూథరన్ లోగో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అందరూ ప్రేమ విందులో పాల్గొన్నారు. కాపరి రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యువత, పిల్లలు, సంఘస్తులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేట ఈస్ట్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) పల్నాడు జిల్లా చైర్మన్ ఎల్.వి.రామిరెడ్డి (ఎస్టీయూ), సెక్రటరీ జనర్ బి.సంపత్‌బాబు (ఏపీటీఎఫ్) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులు శనివారం స్టేషన్ రోడ్డులోని ధర్నా చౌక్ వద్దకు హాజరు కావాలని కోరారు. పీఆర్‌సీని అమలు చేయటంతో పాటు సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తొలగించాలన్నారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలనీ, కారుణ్య నియామకాలు చేపట్టాలని తదితర 18 డిమాండ్ల సాధన కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనాలతో ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి, వీరలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ నిర్వహించామని, సాయంత్రం పద్మావతి అమ్మవారికి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, ఊంజల్ సేవతో కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలు ప్రారంభం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం జిల్లాస్థాయి ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న జిల్లా నుంచి ఎంపికైన జాబితాను రాష్ట్ర కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. ఎంపిక ప్రక్రియలో ఉపాధ్యాయుని వ్యక్తిగత దరఖాస్తు, ఐదుగురు సహ ఉపాధ్యాయుల ద్వారా సిఫారసు, లీప్ యాప్ ఆధారిత పనితీరు ఆధారంగా జిల్లా ఎంపికలు జరుగుతాయని వివరించారు.

అన్నదాతకు గుండెకోత



- భారీగా తగ్గిన అన్నదాతా సుఖీభవ లబ్ధిదారుల సంఖ్య
- కూటమి ప్రభుత్వం వచ్చాక జాబితాలో40 వేల మందికి దక్కని స్థానం
- ఇప్పటికే తొలి ఏడాది నగదు ఇవ్వకుండా మోసగించిన చంద్రబాబు
- ఒకవైపు పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతుల కన్నీరు
- మరోవైపు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు లభించక అవస్థలు
- జిల్లాలో 2,80,181 మందికి రైతు భరోసా అందజేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

బాబు అధికారంలోకి వచ్చారంటే ఏ ఒక్క వర్గాన్నీ వదలకుండా బాధ పెట్టేస్తారు. అదే విషయం అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంలోనూ స్పష్టమైంది. జిల్లాలో ఏకంగా 40 వేల మంది రైతులకు గుండెకోత మిగిలేలా జాబితాలో పేర్లు గల్లంతయ్యాయి.



సూపర్-6లో భాగంగా అన్నదాతా సుఖీభవ పథకం గురించి టీడీపీ మేనిఫెస్టోలో ప్రస్తావన

సాక్షి, నరసరావుపేట: అన్నదాతలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అన్నదాతా సుఖీభవ పథకం నిధులను నేడు విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఏడాదికిపైగా ఎదురుచూస్తున్న రైతులు హమ్మయ్యా నగదు జమ అవుతుందని ఆనందపడేలోపే లబ్ధిదారుల సంఖ్య చూసి ఆవేదన చెందారు. అన్నదాతా సుఖీభవ పేరుతో రైతులకు ఇచ్చే నగదు సాయం పెంచామని ఓ వైపు ప్రచారం చేస్తున్న కూటమి ప్రభుత్వం... మరోవైపు లబ్ధిదారుల సంఖ్యను అమాంతం తగ్గించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చివరి ఏడాదైన 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ రైతు భరోసా కింద పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఏకంగా 2,80,181 మందికి నగదు జమ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శనివారం సాయం అందుకోనున్న లబ్ధిదారుల సంఖ్య మాత్రం 2,40,530 మందిగా ఉంది. ఏకంగా 40 వేల మంది పేర్లు జాబితాలో లేవు. ఏడాది కాలంలోనే రైతుల సంఖ్య అమాంతం ఎందుకు తగ్గిపోయిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది కూటమి ప్రభుత్వం కాదని, కోతల ప్రభుత్వమని రైతులు విమర్శిస్తున్నారు. భారీస్థాయిలో రైతుల సంఖ్య తగ్గడానికి సహేతుకమైన కారణాలు చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఏ మూలకూ సరిపోని సాయం

కూటమి హామీ ప్రకారం జిల్లాలో 2,80,181 మంది రైతులకు ఏటా రూ.560.36 కోట్లు చెల్లించాలి. గతంలో విడతలవారీగా నగదు జమ చేస్తున్నారని విమర్శించిన కూటమి నేతలు... నేడు మొదటి విడతగా కేవలం 2,40,530 మంది రైతులకు రూ.161.04 కోట్లను మాత్రమే ఇవ్వనున్నారు. రైతులకు గతేడాది గిట్టుబాటు ధరలు లేక తీవ్ర నష్టం జరిగింది. ఇప్పుడు విత్తనాలు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో కొనాల్సి వస్తోంది. చేతిలో ఉన్న కొద్దిపాటి సొమ్ము ఎటూ సరిపోని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పీఎం కిసాన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న రూ.2 వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్న రూ.14 వేలను కలిపి రూ.16 వేలను విడుదల చేస్తే ఖరీఫ్ పనులు ప్రారంభించడానికి ఉపయోగపడుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తొలి ఏడాది దగా...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా ఐదేళ్లు వైఎస్సార్ రైతు భరోసా పేరిట రైతులకు ఆర్థిక సహాయం అందజేసేది. ప్రతి రైతుకు ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లపాటు వారి ఖాతాల్లో నగదు జమ చేశారు. ఇలా పల్నాడు జిల్లాలో ఏకంగా రూ.1,738.58 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాలలో వేశారు. తాము అధికారంలోకి వస్తే అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు అందజేస్తామని గత ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక గతేడాది ఆ ఊసే ఎత్తలేదు. ఇలా సుమారు రూ.392 కోట్లను రైతులకు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఆ మొత్తంతోపాటు, వివిధ కారణాల పేరుతో కోతలు లేకుండా రైతులందరికీ సాయం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అందిన రైతు భరోసా నిధులు....

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందిన సాయం (రూ.కోట్లలో)
2019-20	2,41,515	326.04
2020-21	2,50,469	338.13
2021-22	2,48,812	335.90
2022-23	2,66,871	360.27
2023-24	2,80,181	378.24
మొత్తం		1,738.58

నియోజకవర్గాల వారీగా అన్నదాతా సుఖీభవ నగదు కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య

నియోజకవర్గం	రైతుల సంఖ్య
నరసరావుపేట	25,682
చిలకలూరిపేట	27,594
సత్తెనపల్లి	42,516
పెదకూరపాడు	47,255
గురజాల	42,202
మాచర్ల	46,422
వినుకొండ	48,510
మొత్తం	2,80,181

ఉధృతంగా కృష్ణానది ప్రవాహం

రామాపురం మత్స్యకారుల కాలనీకి పొంచి ఉన్న ప్రమాదం



దాచేపల్లి : మండలంలోని రామాపురం మత్స్యకారుల కాలనీకి ప్రమాదం పొంచి ఉంది. నాగర్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో మత్స్యకారుల కాలనీకి పది అడుగుల దూరంలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దిగువకు నీటి విడుదల సామర్థ్యం పెంచితే మత్స్యకారుల కాలనీ నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉన్నది. కాలనీలో సుమారు 40 నివాస గృహాలు ఉన్నాయి. నీటి ప్రవాహం క్రమేసి పెరుగుతూ ఉండటంతో మత్స్యకారులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే నివాస గృహాల్లో ఉన్న సామాన్లను సర్దుకొని ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నదిలో వరద ప్రవాహం పెరిగితే ఏ క్షణానైనా మత్స్యకారులను అక్కడ నుంచి పునరావాస కేంద్రానికి తరలించేలా రెవెన్యూ అధికారులు కూడా తగిన ఏర్పాట్లు చేశారు. కాగా, కృష్ణా నదిలో నీటి ప్రవాహం పెరిగిన ప్రతిసారి మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారు. తాజాగా నదిలో నీటి ప్రవాహం పెరగడం వల్ల నదిలో వేసిన వలలు కొట్టుకుపోయాయి. బోట్లను సురక్షితంగా ఒడ్డుకు చేర్చి కట్టేశారు.

పశ్చిమ డెల్టాకు 6,830 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శుక్రవారం 6,830 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కి 290 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్ 1,725, తూర్పు కాలువ 688, పశ్చిమ కాలువ266, నిజాంపట్నం కాలువ 490, కొమ్మూరు కాలువకు 2,640 క్యూసెక్కులు విడుదల చేశారు. 1,89,625 క్యూసెక్కులు సముద్రంలోకి పంపుతున్నారు.

అభాగ్యులకు పునర్జన్మ


- అవయవ దానంతో నిలుస్తున్న విలువైన ప్రాణాలు
- రేపు జాతీయ అవయవ దాన దినోత్సవం

అవయవదానం వల్ల మరొకరికి నూతన జీవితాన్ని ఇవ్వొచ్చు. భూమిపై లేకున్నా ఇతరుల్లో జీవించి ఉండొచ్చు. జిల్లాలో పలువురు బ్రెయిన్‌డెడ్ అవుతున్నారు. అలాంటి వారి కుటుంబ సభ్యులకు అవగాహన పెంచడం ద్వారా ఎంతోమందికి నూతన జీవితాన్ని ప్రసాదించే వీలుంది. ఏటా ఆగస్టు 3న 'నేషనల్ ఆర్గాన్ డొనేషన్ డే' నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: అవయవాలు అవసరమైన వారు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. దీనికి జీవన్‌దాన్ పేరిట సర్కారు ప్రత్యేక ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన అనంతరం విజయవాడ కేంద్రంగా 2015 నుంచి జీవన్‌దాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల మార్పిడి కోసం పలువురు దరఖాస్తు చేసుకుని అవయవాల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఆపరేషను ఖర్చులు భరించలేక కూడా జీవన్‌దాన్ పథకంలో పేర్లు నమోదు చేయించుకోని వారు అధికంగానే ఉన్నట్లు సమాచారం. అవయవాల కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పలువురు ఎదురు చూస్తున్నారు. సకాలంలో వీరికి అవయవాలు లభించకపోతే ప్రాణాలు కోల్పోవాల్సిందే. మూఢ నమ్మకాలు, అవగాహన లోపంతో ఇప్పటికీ పలువురు అవయవదానానికి ముందుకు రావడం లేదు. తాము ఈ లోకంలో లేకున్నా మరొకరికి దానం చేసిన అవయవాల వలన సజీవంగా ఉండే గొప్ప అవకాశం ఇది. కుటుంబసభ్యులు కూడా ఆ సమయంలో బాధను తట్టుకుని ముందుకు రావడంతో పలువురి ప్రాణాలు నిలిచాయి. అభాగ్యులకు పునర్జన్మ లభించడంతో వారి కుటుంబాల్లో ఆనందాలు వెల్లివిరిశాయి.

ఏవి దానం చేయవచ్చంటే..

మనిషి కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం, జీర్ణ వ్యవస్థలోని ప్యాంక్రియాస్, పేగులు దానం చేయవచ్చు. రోడ్డు ప్రమాదాల్లో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారణ అయిన వారి నుంచి మాత్రమే అవయవాలను సేకరిస్తారు. ఇలా సేకరణకు ఐదు గంటల సమయం పడుతుంది. ఆ తర్వాత గుండె, ఊపిరితిత్తులను అవసరమైన వారికి మూడు గంటల్లోగా అమర్చాలి. కాలేయాన్ని 5 నుంచి 8 గంటలలోపు, మూత్రపిండాలను 15 నుంచి 18 గంటల్లోపు అమర్చాలి. కళ్లు చాలా కాలం నిల్వ చేయవచ్చు.



నమోదు చేసుకోవడం ఇలా...

ఎవరైనా దీనికి అంగీకరించే ముందు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, తనకు తెలిసిన వారందరికీ అవయవ దానం చేస్తున్నట్లు చెప్పాలి. దీని వలన సదరు వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయితే త్వరగా అవయవాలు దానం చేసేందుకు వీలు కలుగుతుంది. www.jeevandan.ap.gov.in వెబ్‌సైట్‌లో డోనర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రభుత్వం వారికి ఓ కార్డును అందజేస్తుంది.

అవయవాలు కావాల్సి వస్తే...


అవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నెంబరు ఇస్తారు. అవయవదానం చేసేందుకు వెబ్‌సైట్‌లో సమాచారం ఇస్తే తక్షణమే సీరియల్ నెంబరు ప్రకారం అవయవాలు అమర్చేలా జీవన్‌దాన్ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తారు.

గుంటూరులో కేంద్రాలు...



జీవన్‌దాన్ కార్యక్రమం గుంటూరు జిల్లాలోని గుంటూరు జీజీహెచ్, వేదాంత హాస్పిటల్, అశ్విని హాస్పిటల్, రమేష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీలక్ష్మీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఎన్‌ఆర్ఐ హాస్పిటల్, కాటూరి హాస్పిటల్, మణిపాల్ హాస్పిటల్, శివ హాస్పిటల్, సుర్ఖ హాస్పిటల్, ఆదిత్య హాస్పిటల్, గుంటూరు కిడ్నీ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, విశిష్ట హాస్పిటల్, డీవీసీ హాస్పిటల్‌లలో అందుబాటులో ఉంది.


విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



అవయవ దానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు 20 ఏళ్లుగా 15 రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సంఘం కృషి ఫలితంగా ఏపీ, తెలంగాణల్లో 58 వేల మంది అవయవదానానికి ముందుకొచ్చారు. 978 మంది అవయవ దాతలు పేర్లు నమోదు చేసుకున్నారు. దాతలను ప్రోత్సహించేలా ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తే బాగుంటుంది.

– డాక్టర్ యశస్వి రమణ, అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్


బ్లడ్ గ్రూప్ కలవకున్నా కిడ్నీ మార్పిడి



బ్లడ్ గ్రూప్ మ్యాచ్ అవ్వకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసే ఆధునిక పద్ధతి అందుబాటులోకి వచ్చింది. రోగులకు ఈ విధానం ఒక వరం. 'ఇమ్యూనో ఎడ్సర్షన్' అనే ఈ విధానం ద్వారా గుంటూరు వేదాంత హాస్పిటల్‌లో ఆపరేషన్లు విజయవంతంగా చేస్తున్నాం. ఈ పద్ధతిని రాష్ట్రంలో మొదటిసారిగా మా ఆస్పత్రిలోనే అందుబాటులోకి తెచ్చాం. రోగులకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నాం.

– డాక్టర్ చింతా రామకృష్ణ, నెఫ్రాలజిస్టు, గుంటూరు

అందరూ ముందుకు రావాలి



గుంటూరు జీజీహెచ్‌లో 2016లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు ప్రారంభించాం. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేస్తున్నాం. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి కిడ్నీలను తీసుకున్న తర్వాత అమర్చేందుకు 4- 5 గంటల సమయం పడుతుంది. ఇప్పటివరకు కిడ్నీలను 25 మందికి ఉచితంగా అమర్చాం. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– డాక్టర్ గొంది శివరామకృష్ణ, నెఫ్రాలజిస్టు, గుంటూరు జీజీహెచ్

9 నుంచి శంకర్‌విలాస్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

- కూల్చివేత పనులు ప్రారంభం
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): శంకర్‌విలాస్ బ్రిడ్జిపై ఈ నెల 9 నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపివేసి కూల్చివేత పనులు చేపడుతున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, అధికారులతో కలిసి నగరంలో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రస్తుతం 2 పిల్లర్స్ కాంక్రీట్ పూర్తి అయ్యాయని, 9 నుంచి కూల్చివేత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే 135 స్ట్రక్చర్లు ఉండగా వాటిలో 74 మంది అంగీకారం తెలిపారని, వారికి నష్ట పరిహారం ఇచ్చి నిర్మాణాలు తొలగించామన్నారు.
- నందివెలుగు రోడ్‌లోని ఆర్‌ఓబీ పనులు 10 రోజుల క్రితమే ప్రారంభమయ్యాయని, 8 నెలల్లో పూర్తి చేసేలా చూస్తామన్నారు.
- మణిహోటల్ సెంటర్‌లో కల్వర్ట్ నిర్మాణం చేయాల్సినందున ఆర్ అండ్ బీ అధికారులు రెండు రోజుల్లో అంచనాలు సిద్ధం చేసి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు.
- ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్ 3 పనులకు 7న టెండర్లు ఓపెన్ అవుతాయని, అనంతరం పనులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు.
- శారదాకాలనీ రోడ్, బ్రాడీపేట, నెహ్రూనగర్ రోడ్‌ల విస్తరణకు, ఎల్సీ నం.3 గేటు దగ్గర ఆర్‌ఓబీ పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్ సమస్యలు రాకుండా ఆటో నగర్, అగతవరప్పాడులను కనెక్ట్ చేసేలా రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- పీవీకే నాయుడు మార్కెట్‌కు గతంలో చేసిన డిజైన్లు ఎవరికి నచ్చలేదు కనుక రివైజ్డ్ డిజైన్లను నిర్ణయించాలన్నారు.
- నల్లపాడు చెరువు, బొంగరాలబీడు కార్మిక శాఖ స్థలాలను నగరపాలక సంస్థకు కేటాయిస్తూ నిర్ణయం జరిగిందన్నారు. త్వరలో పూర్తి స్థాయి అనుమతులు వచ్చాక కార్యాచరణ చేపడతామన్నారు.
- అసంపూర్తిగా ఉన్న గోరంట్ల వాటర్ ట్యాంక్ నిర్మాణ కాంట్రాక్టర్‌ని తొలగించి, నూతన కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించడానికి చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో మరమ్మతులకు గురైన రిజర్వాయర్ల పనులకు టెండర్లు పిలవడం జరిగిందన్నారు.
- శిథిలావస్థకు చేరిన బీఆర్ స్టేడియం రిజర్వాయర్ స్థానంలో రూ.2 కోట్లతో నిర్మాణానికి పనులు ప్రారంభం కానున్నాయన్నారు.
- రెడ్డిపాలెం రోడ్ విస్తరణ గతంలో మాస్టర్ ప్లాన్‌కి భిన్నంగా జరిగినందున, సరిచేయాల్సి ఉందని, 3 వంతెనల వద్ద వర్షం కురిసినప్పుడు నీరు నిలుస్తున్నందున, శాశ్వత పరిష్కారం కోసం సుమారు 2 వందల ఆక్రమణలు తొలగించి, వారికి పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- శారదా కాలనీ రోడ్ విస్తరణలో ప్రభావిత 22 మంది భవన యజమానులకు రూ.50.22 లక్షల నష్ట పరిహార చెక్కులను అందించారు.

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ నేతల దాడి

మాచర్ల రూరల్: పాత కక్షల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై కర్రలు, రాడ్‌లతో దాడిచేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం కంబంపాడు గ్రామానికి చెందిన జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ మాజీ డైరెక్టర్ ఆరికట్ల భాస్కర్ రెడ్డి కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. ఆగస్టు 4న కోర్టు వాయిదా ఉండటంతో ముందుగా మాచర్ల వచ్చాడు. మాచర్ల బస్టాండ్ ఎదురుగా ఉన్న ముస్తఫా బిర్యాని పాయింట్ వద్ద స్నేహితులు మల్లారెడ్డి, జూలకంటి వీరారెడ్డితో మాట్లాడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బెల్లంకొండ కృష్ణ, మరొకరు వెనుకగా వచ్చి పిడుగుద్దులు గుద్ది రాడ్లు, కర్రలతో దాడిచేశారు. దాడిలో భాస్కర్‌రెడ్డికి కుడి, ఎడమచేతికి తీవ్రగాయాలు అయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలించిన జిల్లా కలెక్టర్



నరసరావుపేట రూరల్: పింఛన్లను పెద్దమొత్తంలో పెంచి పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. మండలంలోని కాకాని గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్‌టీఆర్ భరోసా సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలోని పలువురు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధులత, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ జేఎన్‌వీలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చిలకలూరిపేట టౌన్: మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ (11వ తరగతి) ప్రవేశాలకు అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు ప్రకటించారు. సైన్స్, కామర్స్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. 2024–25లో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇందుకు అర్హులు అన్నారు. అలాగే 01.06.2008 నుంచి 31.07.2017 మధ్య జన్మించిన వారే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి మార్కులను ఆధారంగా ఎంపిక చేసుకుని సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని, వాటిని ఆన్‌లైన్ jnvpanaduadmirrionr@mail.com నమోదు చేయడం గానీ లేదా ప్రత్యక్షంగా విద్యాలయానికి వచ్చి ఇవ్వవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు

రేపల్లె: 2024–25 విద్యా సంవత్సరంలో ప్రతిభ కనపరిచిన కాపు విద్యార్థులకు ఈ నెల 22న రేపల్లె పట్టణంలో జరిగే వార్షిక సమావేశంలో ప్రతిభా పురస్కారాలు అందించటం జరుగుతుందని కాపు సేవా సమితి నాయకులు కె.శివశంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో 500ల మార్కులుపైగా సాధించిన, ఇంటర్మీడియెట్, ఆపై చదువులలో 85 శాతం మార్కులు సాధించి ప్రస్తుత విద్యాసంవత్సరంలో చదువుకుంటున్న విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితా, ఆధార్, పూర్తి వివరాలతో కాపు సేవా సమితికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 82478 94595 నంబరులో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ నియామకం

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన షేక్ మస్తాన్‌ను వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కేవలం రూపాయికే బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడమ్

నరసరావుపేట: భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సరికొత్త ఫ్రీడం ప్లాన్, కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్, రోజుకు 2 జీబీ డేటా, రోజుకు 100 మెసేజ్‌లు, ఉచిత సిమ్‌కార్డు ఇవ్వబడుతుందని గుంటూరు బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీ సప్పరపు శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఎం.యస్.పి. వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని, కావున అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సిమ్ కార్డు కావలసిన వారు దగ్గరలోని బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

హాస్టళ్ల నిర్వహణపై చిత్తశుద్ధి లేదు

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- కళాశాల ఎస్సీ బాలుర హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయించిన డాక్టర్ గోపిరెడ్డి
- హాస్టళ్లను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరుతూ కలెక్టర్‌ను కలుస్తాం



హాస్టల్ విద్యార్థులకు ఫ్యాన్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై ఏమాత్రం చిత్తశుద్ధిలేదని మాజీ ఎమ్మెల్యే, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ తరపున ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం రామిరెడ్డిపేట పాతసమితి కార్యాలయం రోడ్డులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహం–2కు పది ఫ్యాన్లు, లైట్లు శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గత నెల 28వ తేదీన ఇదే హాస్టల్‌ను పరిశీలించి అక్కడి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వారికి ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చిన విషయం విదితమే. డాక్టర్ గోపిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మూడు రోజుల క్రితం ఎస్సీ హాస్టల్స్‌ను తనిఖీచేసి అక్కడి పరిస్థితులను పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఈ హాస్టల్లో విద్యార్థులు చదువుకోటానికి లైట్లు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులను చూశామని తెలిపారు. దీంతో ఎనిమిది ఫ్యాన్లు, లైట్లు సమకూర్చామన్నారు. దీనికి సహకరించిన దాతలైన బత్తుల విష్ణు, అన్నా చంద్రమోహన్, విద్యార్థి విభాగ జిల్లా నాయకులు గుజ్జర్లపూడి ఆకాష్, వేణులకు పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌కు సమస్యలు తెలియచేస్తాం

జిల్లా కలెక్టర్ అపాయింట్‌మెంట్ తీసుకొని విద్యార్థులకు కావలసిన తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించే కార్యక్రమం చేయాలని తెలియజేస్తామన్నారు. హాస్టళ్లను క్లీన్ చేయడానికి ఏర్పాటు చేయమని, మంచి బియ్యం సరఫరా చేయమని, నాణ్యత కలిగిన బియ్యం సరఫరా చేసి మంచి భోజనం విద్యార్థులకు పెట్టేవిధంగా ఏర్పాటు చేయమని విన్నవిస్తామన్నారు.

పెద్దచెరువు హాస్టల్‌లో....

కొంతమంది యువకులు డ్రగ్స్ తీసుకొని, మందుతాగి పెద్దచెరువులోని హాస్టల్ ప్రహరీ దూకి లోపలికివచ్చి అక్కడే మద్యం సేవించి చిన్నపిల్లలపై దాడి చేస్తున్నారన్నారు. ఇది చాలా దారుణమైన అంశమని అన్నారు. కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తున్నారని, అన్నం సరిగా లేదని అన్నారు. ఎస్పీకి ఫోన్‌చేస్తే టూ టౌన్ సీఐ, ఎస్ఐలను పంపించి పరిస్థితి చక్కదిద్దారన్నారు. నైట్ వాచ్‌మన్‌ను కూడా ఏర్పాటుచేసే కార్యక్రమం చేస్తున్నారన్నారు. తమ పార్టీ వసతి గృహాలలో చదివే విద్యార్థులకు తోడుగా ఉంటుందని అన్నారు.

మేము రాజకీయం చేయడం లేదు

కేవలం విద్యార్థులు చదువుకునేందుకు మంచి ఏర్పాట్లు ఉంటే, మంచి మార్కులు సాధిస్తారని, ఉన్నత చదువులకు వెళ్లి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తారనే ఈ కార్యక్రమం చేపట్టాం తప్ప, ఇది రాజకీయం కాదని డాక్టర్ గోపిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, విద్యార్థి విభాగ జిల్లా అధ్యక్షులు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు అచ్చి శివకోటి, మండల పార్టీ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షులు కొత్తూరి కిషోర్‌బాబు, గిరిజన కార్పొరేషన మాజీ డైరెక్టర్ పాలపర్తి శ్రీనివాసరావు, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సానికొమ్ము సాంబిరెడ్డి, పీడీ కృష్ణారెడ్డి, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తే తెగుళ్లు దూరం



మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

నరసరావుపేట రూరల్: బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తడం వలన మొక్కలకు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో శుక్రవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అరుణకుమారి మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో రైతులు వరి నారుమళ్లకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మంచి విత్తనం నాటితే మంచి దిగుబడి వస్తుందని ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి చేసి నాటడం వలన మొక్కలకు తెగుళ్ల నుంచి తట్టుకునే శక్తి పెరుగుతుందని వివరించారు. రైతులకు బీజామృతంతో విత్తన శుద్ధి వలన కలిగే లాభాలను వివరించాలని తెలిపారు. వరి, కూరగాయలు, మిరపతోపాటు ఏ రకమైన విత్తనాలైనా సరే బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తే అనేక రకాల ఉపయోగాలు ఉంటాయని తెలిపారు. వ్యవసాయం చేసే రైతులు స్వయంగా విత్తన శుద్ధి చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏ నందకుమార్, సైదయ్య, మేరి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ నాగేశ్వరరావు సేవలు భావితరాలకు ఆదర్శం

ఎస్పీ కె.శ్రీనివాసరావు



ఉద్యోగ విరమణ పొందిన డీఎస్పీ కె.నాగేశ్వరరావును సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: డీఎస్పీగా కె.నాగేశ్వరరావు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శం అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు సన్మాన కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ జేవి సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి.సత్తిరాజు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీ రెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎం.వెంకటరమణలు పాల్గొన్నారు. ఉద్యోగ విరమణ చేసిన డీఎస్పీ నాగేశ్వరరావును ఎస్పీ కె.శ్రీనివాసరావుతోపాటు పోలీసు అధికారులు సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ గతంలో రవాణా సౌకర్యాల కొరత ఉన్నా నక్సలిజం, ఇతర సవాళ్ల మధ్య ఎంతో నిబద్ధతతో విధులు నిర్వర్తించారని తెలిపారు. ఈ సేవల వెనుక కుటుంబ సభ్యుల త్యాగం, సహకారం ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు టి.మాణిక్యాలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో మీరావలికి ప్రథమ స్థానం



దుర్గి: ఇటీవల ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలలో మండల పరిధిలోని అడిగొప్పల గ్రామానికి చెందిన అభ్యర్థి షేక్ మీరావలి ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రథమ ర్యాంకు సొంతం చేసుకున్నాడు. తల్లిదండ్రులు మస్తాన్‌వలి, సైదాబి వ్యవసాయ పనులు చేస్తుంటారు. కుమారుడు కానిస్టేబుల్‌గా ఎంపిక కావటంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీరావలి మాట్లాడుతూ ప్రథమ స్థానం రావటం చాలా సంతోషంగా ఉందన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో డెంగీ నివారణ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి



కొమెరపూడిలో గాబుల్లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి

సత్తెనపల్లి: ముందస్తు జాగ్రత్తలతో దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగీ, చికున్ గున్యా, మలేరియా, బోద , మెదడువాపు వ్యాధులను నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రవి అన్నారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ తో కలిసి శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ దోమల నివారణ చర్యలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు దోమలు పుట్టకుండా అలాగే కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. మురుగునీరు ప్రవహించేటట్లు చర్యలు చేపట్టాల్సిందిగా పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావుకు సూచించారు. క్షేత్ర స్థాయిలో నీటి నిల్వలను పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ దోమలను నివారించాలంటే నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించి ఆరబెట్టి మళ్లీ నీరు పట్టుకోవాలని, (ఫ్రైడే డ్రై డే పాటించాలని), పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలందరూ దోమ తెరలు వాడుకోవాలన్నారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పి గౌతమి ఆధ్వర్యంలో బావులలో, నీటి కుంటల్లో దోమ లార్వాలను తినే గంబూషియా చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి కె. వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి రూరల్ సబ్ యూనిట్ ఆఫీసర్ షేక్ సుభాన్ బేగ్, ఆరోగ్య విస్తరణాధికారి పిట్టల శ్రీనివాస రావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎండీ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీ వైశాలి, ఆరోగ్య కార్యకర్తలు పి.సౌరితేజ, జి నరసింహారావు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత తెలియచేయండి

ఆరోగ్యసిబ్బందికి సూచించిన డీఎంహెచ్‌ఓ

నరసరావుపేట: జిల్లాలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అన్నీ గ్రామాల్లో గల గర్భవతులు, బాలింతలు, ఇతర మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి తెలియచేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శుక్రవారం నుంచి ఏడో తేదీ వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించి బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ ప్రసూన, ఆర్ఎంఓ వెంకటరావు, విజయలక్ష్మి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయలో స్కౌట్స్ అండ్ గైడ్స్ శిబిరం



స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కిట్స్ అందిస్తున్న ప్రిన్సిపల్ నీరజ్

నాదెండ్ల:ఇర్లపాడు పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయలో శుక్రవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో తృతీయ సోపాన్ పరీక్ష శిబిరం 2025 అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణలోని 26 కేంద్రియ విద్యాలయాల నుంచి స్కౌట్స్ విద్యార్థులు హాజరయ్యారు. నాలుగు రోజులపాటు జరిగే శిబిరం తెలంగాణ విద్యార్థులతో కళకళలాడింది. ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్స, ఉపాధ్యాయులు ముందుగా ఘన స్వాగతం పలికారు. తొలిరోజు క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధి, స్నేహపూర్వక ప్రయాణం అంశాలపై కార్యక్రమం జరిగింది. ఉదయం 8.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కాగా, సిబ్బంది క్యాంప్ కిట్లు అందించారు. అనంతరం స్కౌట్స్ పెట్రోల్స్, మార్చ్‌ఫాస్ట్, స్వాగత నృత్యం ఆకర్షించాయి. క్వార్టర్ మాస్టర్ ఎస్.విజయ్‌కుమార్, ఎల్‌వోసీ రమేష్‌బాబు నాయకత్వం, సమాజసేవ, జీవిత నైపుణ్యాలను వివరించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసుల పరంపర కొనసాగుతూనే ఉంది. సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బాదరబోయిన వెంకటేశ్వర్లు (బుజ్జి) పై అధికార పార్టీ నేతల ఒత్తిడి మేరకు అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. శుక్రవారం కోర్టుకు హాజరపరచగా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.సృజన్‌కుమార్ వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అబ్బూరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త పెద్దింటి నాగరాజు, వైఎస్సార్ సీపీ కార్యకర్త బాదరబోయిన వెంకటేశ్వర్లు (బుజ్జి) ఇటీవల ఫోన్‌లో దూషించుకున్నారు. దీనిపై సత్తెనపల్లి రూరల్ పోలీసులకు నాగరాజు ఫిర్యాదు చేశాడు. దూషణ కేసులో పెద్దగా శిక్ష పడదని భావించిన అధికార పార్టీ నాయకులు గ్రామానికి చెందిన పులబోలు బ్రహ్మయ్య అనే వ్యక్తి చేత తప్పుడు కేసు పెట్టించారు. తన వెంట గొడ్డలి తీసుకొని చంపుతానంటూ వెంకటేశ్వర్లు వెంట పడ్డాడంటూ ఫిర్యాదు చేయించారు. దీంతో వెంకటేశ్వర్లు పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ తిరస్కరించి రూ. 15 వేలు వ్యక్తిగత పూచీకత్తు పై బెయిల్ మంజూరు చేశారు.

రెండు లారీలు ఢీకొని డ్రైవర్లకు గాయాలు



వినుకొండ: వినుకొండ మండలం చీకటిగలపాలెం మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూడు లారీలు ఒకదానికొకటి ఢీకొనగా ఇద్దరు లారీ డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు... తెల్లవారుజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్నాయి. వాటిని వెనుక నుంచి వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొనడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. ఘటనలో లారీల ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యాయి. స్థానికులు 108కి సమాచారం తెలపడంతో గాయపడిన డ్రైవర్లను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తరలించారు.